క్లుప్తంగా

చర్మకారులకు గొడుగులు పంపిణీ



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలో చర్మకార వృత్తిలో ఉన్న వారికి శుక్రవారం వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంగళగిరి తహసీల్దార్ రామ్‌ప్రసాద్ చర్మకారులకు గొడుగులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎండలు చాలా తీవ్రంగా ఉన్నాయని, చర్మకారులు ముఖ్య కూడళ్లల్లో ఎటువంటి నీడ లేకుండా చెప్పులు కుడుతున్నారని, రాబోయేది వర్షాకాలమని వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని సేవా దృక్పథంతో వాసవి వనిత క్లబ్ నిర్వాహకులు దేవతి భగవాన్ నారాయణ ఈ గొడుగులను అందజేయడం ఎంతో అభినందించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో సెక్రటరి గాయత్రి, శ్రేష్టి గోపాలకృష్ణ, ఎన్.కుమార్, బొల్లా రాజారావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫైర్ బహూకరణ



తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని రాజీవ్ గృహకల్ప వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌కి దాతలు వాటర్ ప్యూరిఫైర్ మిషన్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా యూపీహెచ్ఎస్ వైద్యాధికారిణి హమీద నీలోఫర్ మాట్లాడుతూ పీఈపీఎల్ అధినేత పిత్నాళ్ల మస్తాన్‌రావు, ఆయన స్నేహితుడు కేవీఎస్ శ్రీనివాస్ సంయుక్తంగా అర్బన్ హెల్త్ సెంటర్‌కు మిషన్‌ను అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ సిబ్బంది అనిత, అలైఖ్య, వందన, దుర్గా భవాని, ప్రేమవాణి, నాగరాజు, మస్తాన్‌రావు, ఫ్రెండ్స్ సర్కిల్ కె.వి.ఎస్. శ్రీనివాసర్, తారక్ మహేష్, శ్రీనివాసరావు, కఠారి శ్రీను పాల్గొన్నారు.

మానసిక వ్యాధులపై అవగాహన ఉండాలి



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మానసిక వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెనాలి ప్రభుత్వ ఆసుపత్రి జిల్లా మానసిక వైద్య నిపుణులు సిహెచ్.మంజీర, డాక్టర్ తిరుమల బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల 2వ శనివారం ప్రాతమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎం. ఇన్నారావు, డాక్టర్ ఎం.కృపా, స్టాఫ్ నర్సర్ శ్రీమతి శ్రావణి పాల్గొన్నారు.

ముత్తుజానగర్ షాదీఖానా నూతన కమిటీ ఏర్పాటు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని ముత్తుజానగర్ అంజుమన్ షాదీఖానా నిర్వహణ నూతన కమిటీని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ దుగ్గిరాల గ్రామంలోని ముత్తుజానగర్ అంజుమన్ షాదీఖానా నిర్వహణ పాత కమిటీని రద్దుచేసి నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతన కమిటీ ప్రెసిడెంట్‌గా షేక్ సలీమ్, వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ రబ్బాని, ట్రెజరర్‌గా ఖాదర్ బేగ్, సభ్యులుగా సయ్యద్ ఇస్మాయిల్, షేక్ రోషన్‌ను నియమించామని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడికొండ: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ చిలకరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుళ్లూరు మండలం రాయపూడి, అనంతవరం సబ్‌స్టేషన్‌లలో పెద్ద లైన్ల మరమ్మతులు, చెట్టు కొమ్మల తొలగింపు చేపట్టినట్లు వివరించారు. ఉదయం 8 గంటల నుంచి 1.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

మేడికొండూరు మండలంలో...

మేడికొండూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేనున్నట్లు ఏఈ జి.నాగరాజకుమార్ శుక్రవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కోత ఉంటుందని చెప్పారు.

రేపు పునీత అంథోని పుణ్యక్షేత్ర వార్షికోత్సవం

నెహ్రూనగర్: నగరంపాలెంలోని పునీత అంథోని పుణ్యక్షేత్రంలో 33వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు విచారణ గురువు, రెక్టార్ ఫాదర్ పి.రాజారెడ్డి తెలియజేశారు. పుణ్యక్షేత్రంలో శుక్రవారం వార్షికోత్సవం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆదివారం పుణ్యక్షేత్రం ఆవరణలో వేడుకల్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ప్రతి లే అవుట్‌లోనూ మౌలిక సదుపాయాలు

- జూలై 8న శంకుస్థాపన మహోత్సవం
- సంక్రాంతి, క్రిస్మస్ నాటికి గృహప్రవేశాలు
- ఎమ్మెల్యే ఆర్కే వెల్లడి



తాడేపల్లి పట్టణ పరిధికి చెందిన లబ్ధిదారులకు నవులూరు లే అవుట్‌లో ఇళ్ల పట్టా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తదితరులు

తాడేపల్లిరూరల్: ప్రతి లే అవుట్‌లోనూ మౌలిక సదుపాయాలు కల్పించి, అక్కా చెల్లెమ్మలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో జూలై 8న శంకుస్థాపన నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణానికి చెందిన లబ్ధిదారులైన నిడమర్రు లే అవుట్‌లో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత టిడ్కో నివాసల లే అవుట్‌ల పట్టాలు పంపిణీ చేసి, అనంతరం ఎర్రబాలెం సమీపంలోని నవులూరు లే అవుట్‌లో లబ్ధిదారులకు ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, తాడేపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డితో కలసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా సీఆర్‌డీఏ పరిధిలో ఏర్పాటు చేసిన 50 వేల ప్లాట్లలో శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శంకుస్థాపన తరువాత క్రిస్మస్, సంక్రాంతిలోగా ఇంటి నిర్మాణం పూర్తి చేసి అక్కాచెల్లెమ్మల సొంతింటి కల నెరవేరుస్తామని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, యువజన నాయకులు మహేష్, కాపు సంఘం నాయకులు కిషోర్ పాల్గొన్నారు.

ఈ ఇళ్లస్థలం మాకెంతో భరోసా



మా ఆయన లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. మా పెళ్లయిన దగ్గర నుంచి మాకు సొంత ఇల్లు లేదు. ఎన్నోసార్లు జన్మభూమి కమిటీల్ల దరఖాస్తు చేసుకున్నాం. ఇళ్ల స్థలం కానీ, ఇల్లు కానీ రాలేదు. జగనన్న ప్రభుత్వంలో మాకు ఇళ్ల స్థలం వచ్చింది. త్వరలోనే ఇల్లు కట్టుకుంటాం.

– కత్తిక నాగ అరుణ, పోలకంపాడు

అన్న పసుపు కుంకుమ కింద ఈ స్థలం ఇచ్చాడు



మా అమ్మా నాన్న, మా అత్త మామలు మాకు ఎటువంటి ఆస్తులు ఇవ్వలేదు. జగనన్న మమ్మల్ని తోబుట్టువులా భావించి మాకు పసుపు కుంకుమ కింద ఇంటి స్థలాన్ని ఇచ్చాడు. త్వరలోనే కొత్త ఇల్లు నిర్మించుకుని అందులో జగనన్న ఫొటోతో గృహ ప్రవేశం చేస్తాం.

– యస్‌కే అసనవాడ్, తాడేపల్లి 1వ వార్డు

సొంతిల్లు కట్టలేననుకున్నాను



మా కులంలో రాజులని పేరు ఉంది. కానీ మేము మట్టి పని చేసుకుని జీవిస్తున్నాం. మా అత్తమామల దగ్గర నుంచి మాకు సొంత ఇల్లు లేదు. మా ఆయన మట్టి పని మానేసి ఆటో తోలుతున్నాడు. సంపాదించిన సంపాదన అంతా ఇంటి ఖర్చులకే సరిపోతుంది. నేను బతికున్నంత కాలం సొంత ఇల్లు కట్టుకోలేమేమో అనుకున్నాం. జగనన్న వల్ల ఆ కోరిక నెరవేరుతోంది. – గోగుల సత్యవతి, పోలకంపాడు

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు

తాడేపల్లిరూరల్: భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతుకు గుర్తింపు కార్డు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు కోరారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో కౌలు రైతులకు కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలుతో వ్యవసాయం చేసే కౌలు రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలేక, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా అందక ఇబ్బందులు పడున్నారని అన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు కౌలు రైతులు భూ యజమాని సంతకం ఉండాలన్న అధికారుల నిబంధన సరైనది కాదని అన్నారు. తక్షణమే భూ యజమాని సంతకం ఉండాలన్న నిబంధనను తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 12వ తేదీన కౌలు రైతుల సమస్యలపై మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద నిర్వహించనున్న రాయబార కార్యక్రమానికి కౌలు రైతులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతు సంఘం మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, అమ్మిశెట్టి రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలను రెగ్యులర్ చేసి పట్టాలు ఇవ్వాలి



తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డికి సమస్యలు వివరిస్తున్న సీపీఎం నాయకుడు వెంకటరెడ్డి

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఇల్లులేని నిరుపేదలు వేసుకున్న ఇళ్లను శుక్రవారం తాడేపల్లి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, తహసీల్దార్‌ని కలసి మాట్లాడారు. సర్వే నంబర్ 18లో ఇల్లులేని నిరుపేదలు గత 16 సంవత్సరాలుగా ఇల్లు వేసుకుని నివసిస్తున్న వారికి ఇళ్లను రెగ్యులర్ చేయాలని కోరారు. పేదలు ఇల్లు వేసుకున్న ప్రాంతంలో మంచినీటి సౌకర్యం లేదని, మురుగునీరు పాదుల లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ విషయమై స్పందించిన తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి వడ్డేశ్వరంలో పేదల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డేశ్వరం గ్రామవీఆర్‌ఓ ఆశ, గ్రామ సర్వేయర్ గోపీచంద్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు కత్తిక రాఘవరావు(బుల్లబ్బాయి), ఎస్సీ కాలనీ వాసులు కామినేని సాంబశివరావు, కారసాల స్వాతి, చిన్ని, ఎస్‌కే బాజీ, వడ్డేశ్వరం చిన్నా పాల్గొన్నారు.

చేనేత సమస్యలు పరిష్కరించాలి

చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు

తాడేపల్లిరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా చేనేతల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు వై.కోటేశ్వరరావు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని పోట్లాబత్తుని వెంకటేశ్వరరావు కళానిలయంలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పిల్లల మర్రి బాలకృష్ణ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ చేనేత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేకుంటే జూన్ 19వ తేదీన 26 జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి స్పందనలో వినతి పత్రాలు అందజేస్తామని అన్నారు. అనంతరం చేనేత కార్మికుల డిమాండ్లను వివరిస్తూ కరపత్రాన్ని విడుదల చేశారు. సమావేశంలో రామనాథం పరమేశ్వరరావు, పుచ్చల నాగేశ్వరరావు, జొన్నాదుల వరప్రసాదరావు, రావెల శివ సత్యనారాయణ, పోట్లబత్తుని లక్ష్మణరావు, పిల్లల మర్రి నాగేశ్వరరావు, రామనాథం పూర్ణచంద్రరావు, డోకుపర్తి రామారావు, కూరపాటి కోటేశ్వరరావు, కొతవరపు వెంకటేశ్వరరావు, దొడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషి

తాడేపల్లిరూరల్: చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయడమే అంగన్‌వాడీ లక్ష్యమని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ మనోరంజని అన్నారు. తాడేపల్లి బ్రహ్మానందపురంలో శుక్రవారం ప్రీ స్కూల్ సంసిద్ధత మరియు సర్టిఫికెట్స్ బహూకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రీస్కూల్‌కు సంబంధించిన పీపీ 1, పీపీ 2, పుస్తకాల గురించి వివరించారు. ఏపీడీపీఓ కె.సరిత మాట్లాడుతూ మూడు నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరినీ అంగన్‌వాడీలో చేర్పించాలని తల్లిదండ్రులకు కోరారు. కార్యక్రమంలో ప్రథమ కో ఆర్డినేటర్ ఎం.స్వాతి పాల్గొన్నారు.

పెనుమాకలో.....

పెనుమాకలో స్కూల్ రెడీనెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు 25 మంది పిల్లలను ఒకటో తరగతిలో చేర్పించారు. గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్యవేక్షకులు వి.శ్రీదేవి, ఎన్. భవాని, బి.గంగాభవాని, ఎం.వాణి, జి.విజయ, పి.రత్నకుమారి, బి. జ్యోతి, జి.వేణు కుమారి పాల్గొన్నారు.

వేగవంతంగా పైపులైన్ మరమ్మతులు

ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడులో ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మురుగునీటి పారుదలకు పైపులైన్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు నియోజకవర్గ పార్టీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌కు విన్నవించారు. స్పందించిన సురేష్‌కుమార్ పనులు నిర్వహించేందుకు సొంత నిధులు కేటాయించి ఆదేశాలు ఇవ్వడంతో కొద్దిరోజులుగా గ్రామంలో ప్రధాన వీధులకు ఇరువైపులా పైపులైను ఏర్పాటు చేసేందుకు వీలుగా పొక్లెయిన్‌తో పనులు నిర్వహిస్తున్నారు. పనులను పార్టీ గ్రామ అధ్యక్షుడు శనగల నాగిరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ బహూకరణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు దాత సహకారంతో శుక్రవారం నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. ఏడుకొండలు మాట్లాడుతూ ఈమని పాఠశాల పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మాట్లాడుతూ విద్యార్థులు అందరూ కష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలని, కార్యక్రమంలో దాత చుండూరు భాస్కరరావు, ఉపాధ్యాయుడు సూరగాని ప్రకాశరావు, అధ్యాపకులు ఎం. సురేష్‌కుమార్, కె.డేవిడ్, జేవీ సుబ్బారావు, సిహెచ్.లక్ష్మణ్‌కుమార్, ఎస్. ప్రకాశరావు, ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రూ.5 లక్షల అపరాధ రుసుం వసూలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవార ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ అక్కల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళగిరి పట్టణంలో విద్యుత్ చౌర్యం, ఇతర విషయాలపై జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో మొత్తం 2,686 సర్వీస్‌లను పరిశీలించగా, 101 మంది విద్యుత్ వినియోగదారులు అధిక లోడ్ వినియోగించడం, పలుచోట్ల చౌర్యం చేయడం గుర్తించి, వీరి నుంచి అపరాధ రుసుం కింద రూ.5, 54,550 వసూలు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌డీపీ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ప్రత్తిపాటి విజయకుమార్, కె.వి.యల్.ఎన్.మూర్తి, డీపీఈ కె.వి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుతో అధిక దిగుబడి

ఫిరంగిపురం: పచ్చిరొట్ట ఎరువులతో అధికదిగుబడి సాధించవచ్చని ఎంపీపీ షేక్ షహేలాన గ్రీస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహామండలి చైర్మన్ డి.బుచ్చిరెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహామండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ పైరు సాగుకు ముందుగా రైతన్నలు తప్పనిసరిగా పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవాలని చెప్పారు. రైతులందరు పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రతి ఏటా ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతులకు 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు జనుములు, జీలుగలు, పిల్లిపెసర విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జి.చంద్రం, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీఓ డి.అనూరాధ, ఉద్యాన శాఖ అధికారి మండల అశోక్‌రెడ్డి, ఏవో రమణకుమార్, పశువైద్యాధికారి కోటిరత్నం పాల్గొన్నారు.

రెవెన్యూ నూతన భవనం ప్రారంభం



తాడికొండ: తాడికొండ మండల రెవెన్యూ కార్యాలయంలో పురాతన భవనాన్ని బోయపాటి ట్రస్టు అధ్యక్షుడు బోయపాటి సాంబశివరావు ప్రారంభించారు. పురాతన భవనం శ్లాబ్ శిథిలం కావడంతో గతంలో ఉద్యోగులు వర్షాకాలం నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉండేది. ఇటీవల మోతడక గ్రామానికి చెందిన బోయపాటి ట్రస్టు ఆధ్వర్యంలో కొత్తగా శ్లాబ్‌ను నిర్మించి భవనాన్ని ఆధునీకరించడంతో ఉద్యోగుల కష్టాలు తీరాయి. నూతన భవనాన్ని తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు, ట్రస్టు అధ్యక్షుడు బోయపాటి సాంబశివరావు ప్రారంభించారు.

కేఎల్‌యూ ఎన్‌సీసీ క్యాడెట్లకు అవార్డులు



ఎన్‌సీసీ క్యాడెట్ సాత్వికను అభినందిస్తున్న కల్నల్ సిద్ధూ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్ విశ్వవిద్యాలయానికి చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు బెస్ట్ క్యాడెట్ అవార్డు అందుకున్నారని హబీక్లబ్ ఇన్‌చార్జి సుభాకర్ రాజు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ 25వ ఎన్‌సీసీ బెటాలియన్ గత నెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వార్షిక శిక్షణ శిబిరంలో బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పి.ఎస్. సిద్ధూ చేతుల మీదుగా బెస్ట్ క్యాడెట్ అవార్డును అందుకున్నారని అన్నారు. శిక్షణ సమయంలో టెంట్ పిచ్చింగ్‌లో సాత్విక, డ్రిల్‌లో ప్రణీతలు ప్రథమ స్థానంలో నిలిచి ఉత్తమ క్యాడెట్ అవార్డులను అందుకున్నారని అన్నారు. క్యాడెట్లను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, డీన్ యొక్క సలహాదారులు డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, సాక్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య అభినందించారు.

వాట్సప్ మెసేజ్‌కు స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే



రాత్రి సమయంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని రత్నాల చెరువులో స్థానికంగా ఉండేవారు రోడ్డు పరిస్థితిని వివరిస్తూ ఎమ్మెల్యే ఆర్కేకు వాట్సప్ మెసేజ్ చేయడంతో 12 గంటల వ్యవధిలో శుక్రవారం ఉదయం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. మంగళగిరి రత్నాల చెరువులో నివాసముండే కొంతమంది నివాసాల మధ్య రోడ్డు లేక పిచ్చిమొక్కలు పెరిగి నడవడానికి వీలు లేకుండా ఉంటోందని స్థానికంగా ఉండేవారు గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఫొటోలో సందేశం పంపారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే హైదరాబాద్ నుంచి రాత్రి 12 గంటల సమయంలో ఆ ప్రాంతానికి వచ్చి స్థానికులతో మాట్లాడి రోడ్డు పరిస్థితిని పరిశీలించారు. ఉదయం ఎంటీఎంసీ డీఈ కృష్ణారెడ్డిని రత్నాల చెరువులో రోడ్డు పరిస్థితి వివరించారు. అక్కడ యుద్ధప్రాతికదిన పొదలు తొలగించి రోడ్లు వేయాలని ఆదేశించడంతో అధికారులు రత్నాల చెరువులో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆర్కే వాట్సప్ మెసేజ్‌కు స్పందించిన రాత్రి సమయమైనా వచ్చి ఇబ్బందులను తెలుసుకుని రోడ్డు నిర్మాణ పనులకు ఆదేశించినందుకు ఆయనకు కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

చేనేత మగ్గం షెడ్లను త్వరగా పూర్తిచేయాలి

ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



చేనేత మగ్గం షెడ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే తదితరులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని రాజీవ్ గృహకల్ప వద్ద అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన చేనేత షెడ్లను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి శుక్రవారం పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నిర్మించే షెడ్డులలో రెండు రకాల మగ్గాలను ఏర్పాటు చేస్తున్నామని, ఒకటి గుంట మగ్గాలు, రెండవది స్టాండ్‌మగ్గాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం చేనేత షెడ్లలో మగ్గాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరో నాలుగైదు రోజుల్లో ఆ పనులు పూర్తవుతాయని ఆయన అన్నారు. మగ్గాల ఏర్పాట్లలో ఎప్పటిప్పుడు నాణ్యతా లోపం లేకుండా చూసుకునే విధంగా అధికారులను కోరామని, అతి త్వరలోనే మగ్గాల షెడ్డులు పూర్తిచేసి అర్హులైన వారికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ పరిశీలన......

టిడ్కో గృహ సముదాయం వద్ద నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ పనులు ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్నామని, ఈ షాపింగ్ కాంప్లెక్స్ త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని అన్నారు.

పెద్ద కోనేరు పనుల పరిశీలన....

మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి పుష్కరిణి పునరుద్ధరణ పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కార్పొరేషన్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద కోనేరు పునరుద్ధరణకు ప్రత్యేకంగా కుప్పం నుంచి తీసుకు వచ్చిన రాతి పనివారితో కూలిపోయిన మెట్ల నిర్మాణ పనులు చేపట్టామని, వర్షాలు వచ్చే నాటికి ఈ పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమాల్లో హ్యాండ్‌లూమ్స్ ఏడీ వనజ, జిల్లా చేతన విభాగం అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం తోపుడు బండ్లు అందజేత

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సహకారంతో శుక్రవారం తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు అందజేశారు. చినకాకానిలో అద్దె బండ్లపై వ్యాపారం చేసుకుంటున్న వారికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయంతో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తోపుడు బండ్లు అందజేశారు.

నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ



తాడేపల్లిరూరల్: మంగళగిరిలోని నిరుపేద కుటుంబానికి విజయ హెల్త్ కేర్ ట్రస్ట్, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినికిడి మిషన్, రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు శుక్రవారం అందజేశారు. మాట్లాడుతూ మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి కాలనీకి చెందిన రమణ పదేళ్లుగా రెండు చెవులు వినికిడి పూర్తి తగ్గి కూలిపనిచేస్తూ జీవిస్తోంది. భర్త నారాయణకు మూర్ఛరోగం కారణంగా కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని, గత 20 రోజుల క్రితం కరెంట్ షాక్ తగలడంతో రమణ భుజం విరిగి పనిచేసుకోవడానికి ఇబ్బంది పడుతుండగా విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ సహకారంతో కొత్త వినికిడి మిషన్, రెండు నెలలకు సరిపడా నిత్యావసరా అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, సంక్షేమ సంఘం నాయకుడు శివరాం బాబాజీ, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ కాగితాల స్వాతి, నియోజకవర్గ అధ్యక్షులు వుడతా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ తిరువీధుల కిరణ్, మంగళగిరి పట్టణ అధ్యక్షురాలు బిత్రా ఈశ్వరి, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ మెంబర్ బొండేటి రమేష్ పాల్గొన్నారు.